క్లుప్తంగా

నేడు మాజీ సర్పంచులకు సన్మానం

కందుకూరు: మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో ఇటీవల ఐదేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న సర్పంచులకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకట్రాములు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉ.10 గంటలకు మండల పరిషత్ సమావేశ హాల్‌లో నిర్వహించే కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎమ్మెల్యే సబితారెడ్డితో పాటు ఎంపీపీ మంద జ్యోతి పాండు, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారన్నారు.

10న ఆర్యవైశ్య సంఘం సమావేశం

హుడాకాంప్లెక్స్: గడ్డిఅన్నారం ఆర్యవైశ్య సంఘం సర్వసభ్య సమావేశం ఈ నెల 10వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు చింతల బాలరాజ్‌గుప్తా పేర్కొన్నారు. కర్మన్‌ఘాట్‌లోని శ్రీలక్ష్మి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే సమావేశానికి ఆర్యవైశ్య సంఘం సభ్యులందరూ విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులు పరిశీలన



ఓల్డ్ విలేజ్‌లో నిర్మాణ పనులు పరిశీలిస్తున్న మేయర్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 20వ డివిజన్‌లోని ఓల్డ్ విలేజ్‌లో మంగళవారం ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత పరిశీలించారు. పనులు నాణ్యతగా చేయాలని గుత్తేదార్లను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణ, కుమార్, తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు

తుక్కుగూడ: మహిమాన్వితమైన సూర్యగిరి ఎల్లమ్మ తల్లి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. అమ్మవారికి ఇష్టమైన రోజు మంగళవారం ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారికి బోనంతో నైవేద్యం సమర్పించుకున్నారు. అనంతరం సామూహిక సత్యానారాయణ వ్రతాలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రత్నం, సిబ్బంది కాశీనాథ్, పూజారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

భవన శిథిలాల డంపింగ్ అడ్డగింత



చెరువులో డంప్ చేయడానికి వచ్చిన ట్రాక్టర్లను అడ్డుకున్న అధికారులు

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని పెద్ద చెరువులో భవనాల శిథిలాలను డంప్ చేస్తున్న ట్రాక్టర్లను మంగళవారం నీటిపారుదల శాఖ అధికారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ గంగరాజు మాట్లాడుతూ.. పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో భవనాల శిథిలాలు, మట్టిని డంప్ చేస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. దీంతో చెరువు వద్దకు చేరుకుని డంప్ చేస్తున్న ట్రాక్టర్ల డ్రైవర్లను ప్రశ్నించగా, మున్సిపల్ అధికారులు చెప్పడం వల్లే డంప్ చేస్తున్నామని చెప్పారు. వెంటనే కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా, ఇకపై ఎఫ్‌టీఎల్‌లో డంప్ చేయకుండా చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు వర్క్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

సీనియర్ సిటిజన్ల సలహాలు, సూచనలు పాటించాలి

మన్సూరాబాద్: సీనియర్ సిటిజన్ల సలహాలు, సూచనాలను నేటి సమాజానికి ఆదర్శమని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ప్రగతినగర్ కాలనీలోని సీనియర్ సిటిజన్ భవనంలో ఆదర్శ సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సంఘం దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన నర్సింహారెడ్డి మాట్లాడుతూ, సినియర్ సిటిజన్లు కుటుంబ సభ్యుల వలే కలిసి మెలిసి ఒకరికొకరు తోడుగా కార్యక్రమాలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. సీనియర్ సిటిజన్లు మేము సైతం యువకులమంటూ క్రీడల్లో పాల్గొనడం సంతోషాన్ని ఇస్తోందన్నారు.

రోడ్డంతా గుంతలే..!



గుంతలమయంగా మారిన దెబ్బడగూ రహదారి

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- అవస్థలు పడుతున్న గ్రామస్తులు

కందుకూరు: రహదారి గుంతలమయంగా మారడంతో ఆ గ్రామస్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రహదారి నిర్మించి ఏళ్లు గడుస్తున్నా.. పట్టించుకునే వారే కరువైయ్యారు. మండల పరిధిలోని దెబ్బడగూడ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి.

రెండు కిలోమీటర్ల మేర

కందుకూరు–మీర్‌ఖాన్‌పేట రహదారి నుంచి దెబ్బడగూడ గ్రామం వైపు వెళ్లే రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. దాదాపుగా రెండు కిలోమీటర్ల మేర రహదారి ఛిద్రంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళలో ప్రయాణించాలంటే తిప్పలు తప్పడం లేదు. అదుపు తప్పితే ప్రమాదం బారిన పడాల్సిందే. ఏదీ రోడ్డు, ఏది గుంతో తెలియడం లేదు..

మరోపక్క గ్రామం మీదుగా శ్రీశైలం రహదారికి నేరుగా చేరుకునే అవకాశం ఉన్నా మధ్యలో కొంత రహదారి అధ్వానంగా ఉండటంతో అటు నుంచి వెళ్లడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుంతలమయంగా..



మండల కేంద్రం నుంచి మా గ్రామానికి వచ్చే రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. ఆ రహదారిపై ప్రయాణించాలంటే అవస్థలు పడుతున్నాం. ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు కాని కొత్తగా రోడ్డుగాని నిర్మించడం లేదు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– క్షేమం చెన్నారెడ్డి, దెబ్బడగూడ

టెండర్ ప్రక్రియలో ఉంది



దెబ్బడగూడ గ్రామానికి వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది వాస్తవమే. ఆ రహదారికి మరమ్మతులు చేపట్టడానికి నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం.. మంజూరైయ్యాయి. ప్రస్తుతం టెండర్ ప్రక్రియలో ఉంది. టెండర్ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– సతీష్‌రెడ్డి, ఏఈపీఆర్, కందుకూరు

సమ్మెను విజయవంతం చేయండి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్

మహేశ్వరం: ఫిబ్రవరి 16న చేపట్టనున్న గ్రామీణ బంద్‌లో ప్రతి ఒక్క కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.రవికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, అంగన్‌వాడీ హెల్పర్స్, టీచర్స్ యూనియన్, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం యూనియన్ సభ్యులు అధికారులకు సమ్మె నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వంలో ప్రజలపై కార్పొరేట్, మతతత్వ, నిరంకుశ దాడి పెరుగుతుందని మండిపడ్డారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి, రైల్వే, రక్షణ, విద్యుత్ సహా ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ చేసే చర్యలను మానుకోవాలన్నారు. ప్రతి కార్మికుడికి నెలకు రూ.26 వేలు, ప్రభుత్వ అలవెన్సులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సీఐటీయూ కోశాధికారి కవిత, సీఐటీయూ మండల కన్వీనర్ శేఖర్, అంగన్‌వాటీ టీచర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

కందుకూరు: ఈ నెల 16న దేశవ్యాప్తంగా చేపట్టనున్న గ్రామీణ బంద్‌లో ఆశవర్కర్లు పాల్గొంటున్నట్లు మంగళవారం కందుకూరు పీహెచ్‌సీలో వైద్యాధికారిణి డాక్టర్ రాధికకు సమ్మె నోటీసు అందజేశారు. కార్మికుల హక్కులను పరిరక్షించుకునేందుకు బంద్‌లో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ కోరారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు జయసుధ, శ్రీలత, అనిత, చంద్రకళ, అప్రోచ్, ముంతాజ్‌బేగం, సునీత, అశ్విని, జయమ్మ, సురేష్ పాల్గొన్నారు.



సమ్మె నోటీసును అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్లు, నాయకులు



వైద్యాధికారిణికి సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశ వర్కర్లు

మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి

పీసీసీ కార్యదర్శి జానకీరామ్

తుక్కుగూడ: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖలు చేసిన బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై కేసు నమోదు చేయాలని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి గోగికర్ జానకీరామ్ డిమాండ్ చేశారు. పీసీసీ పిలుపు మేరకు మంగళవారం పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో ఆపార్టీ నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్క సుమన్ మతిభ్రమించి సీఎంపై వ్యాఖలు చేస్తున్నారని మండిపడ్డారు. అతనిపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు యాదయ్య, రాజ్‌కుమార్, అజయ్, రాజు, శ్రీకర్, స్వామి, మహేష్, హెరాల్డ్, తదితరులు పాల్గొన్నారు.

బాల్క సుమన్‌పై ఫిర్యాదు

బడంగ్‌పేట్: సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని మంగళవారం బడంగ్‌పేట కాంగ్రెస్ పార్టీకి నాయకులు మీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి అనే గౌరవం ఇవ్వకుండా కేసీఆర్ కుటుంబానికి చెంచాగిరి చేస్తూ.. కేసీఆర్, కేటీఆర్ మెప్పు పొందేందుకు సీఎంపై అనుచితంగా వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఇన్స్‌పెక్టర్ కాశీవిశ్వనాద్‌కు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు.



మీర్‌పేట్ పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

బీఆర్‌ఎస్ ఖాళీ అవడం ఖాయం

మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరంలో బీఆర్‌ఎస్ పార్టీ ఖాళీ అవ్వడం ఖాయమని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మన్సాన్‌పల్లికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, రేణుకాఎల్లమ్మ ఆలయ చైర్మన్ మర్యాద మురళిధర్‌తో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి లక్ష్మారెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అన్నారు. కొందరు పదవులు అనుభవించి కన్నతల్లిలాంటి పార్టీని వదిలి తమ స్వార్థం కోసం ఇతర పార్టీలోకి వెళ్లారని అన్నారు. నాయకులు వెళ్లినా కార్యకర్తలు బలంగా ఉన్నారని చెప్పారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై చాలా మంది స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ ఎనుగు జంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఈశ్వర్, కృష్ణానాయక్, బాల్‌రాజ్, రాజునాయక్, లాజర్, పాండునాయక్, సామ సురేందర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, యాదయ్య, వెంకట్‌రెడ్డి, జంగయ్య, కుమార్, అంజయ్య, రమేష్ పలువురు పాల్గొన్నారు.



మహేశ్వరం: కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

లీడర్లను తయారు చేస్తా

బడంగ్‌పేట్: అసెంబ్లీ ఎన్నికల్లో కొంత తప్పిదాలు జరిగాయి. అది సహజమే.. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో 32 సీట్లకు గాను 32 కాంగ్రెస్ పార్టీ గెలిపించుకునేలా కార్యకర్తలను లీడర్లుగా తయారు చేస్తానని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గం ఇన్‌చార్జి లక్ష్మారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో నిర్వహించిన బూత్ కమిటీ స్థాయి విస్తృత సమావేశానికి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లో 540 బూత్‌లు ఉన్నాయి.. ప్రతి 20 ఇళ్లకు ఒక కమిటీ మెంబర్‌ను ఎన్నుకుని పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కలిసికట్టుగా పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం కేఎల్‌ఆర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ పారిజాతరెడ్డి, కార్పొరేటర్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



ఎస్‌బీఐ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి, అధికారులు

హుడాకాంప్లెక్స్: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి పేర్కొన్నారు. మంగళవారం డివిజన్ పరిధి ఎస్‌బీఐ కాలనీలో జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్లపై మురుగునీరు ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే, మ్యాన్‌హోల్‌పై మూతలు ఉండేలా చూడాలని చెప్పారు. తాగునీరు కలుషితం కాకుండా, పైపులైన్ లీకేజీలపై దృష్టి పెట్టాలని సూచించారు. కాలనీవాసులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సమస్యలు తలెత్తకుండా చూస్తానని భరోసా కల్పించారు. కార్యక్రమంలో జలమండలి జీఎం, డీజీఎం, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ విజయం పౌరాణిక పద్య నాటక ప్రదర్శన నేడు

వనస్థలిపురం: దర్శక, నటుడు ఆంధ్ర సాంబమూర్తి జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రంగస్థల కళాకారుల అభిమాన సమాఖ్య, వేదభూమి సంస్థల ఆధ్వర్యంలో వనస్థలిపురం ఎన్జీఓస్ కాలనీలోని చంద్ర కళా వేదికపై బుధవారం సాయంత్రం 6.30 గంటలకు శ్రీ కృష్ణ విజయం (పాండవోద్యోగంలోని ఘట్టాలు) పౌరాణిక పద్య నాటకంను ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నాటకరంగ కళాభిమానులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు

దిల్‌సుఖ్‌నగర్: నేషనల్ స్పేస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ లైవ్ ఇన్ హెల్త్ స్పేప్ పోటీల్లో ఆర్‌కేపురం నారాయణ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అంతరిక్షంలో పచ్చదనాన్ని పెంపొందించడంపై ప్రాజెక్టును రూపొందించారు. అంతరిక్షాన్ని ఏ విధంగా సస్యశ్యామలం చేయాలో తమ ప్రాజెక్ట్ ద్వారా ప్రదర్శించి అంతర్జాతీయ పోటీల్లో ప్రతిభ చాటి మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా మంగళవారం నారాయణ స్కూల్ ఆర్‌కే పురం విభాగం ఏజీఎం హేమాంబర్, ఆర్‌డీ శివరంజని, కో ఆర్డినేటర్ రఫీ, ప్రిన్సిపాల్ నీరజ, అకాడమీక్ డీన్ మహేష్, ఏఓ రమేష్‌లు విద్యార్థుల ప్రతిభను కొనియాడి వారిని పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి సహకరించిన నాసా ఇన్‌చార్జ్ అరుణ, వెంకటేశ్వర్లుకు శుభాకాంక్షలు తెలిపారు.

రైతు బజారులో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 23, వంకాయ 18, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 40, క్యాబేజీ 23, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 23, దొండ 30–45, చిక్కుడు 23–35, గోకర 45, బీట్‌రూట్ 19, క్యాప్సికం 60, ఆలు 22, దోస 18, సొర 11, పొట్ల 13, ఉల్లిగడ్డ 19, చామగడ్డ 60.ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

పర్యావరణ పరిరక్షణ ముఖ్యం

ఆమనగల్లు: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఐక్యత ఫౌండేషన్ సభ్యుడు, కాంగ్రెస్ నాయకుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కోరారు. ఆమనగల్లు పట్టణంలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు జితేందర్, దశరథం, వగ్రప్రసాద్ రెడ్డి, జంగయ్య, రవీందర్‌నాయక్, మల్లయ్య, కృష్ణ నాయక్, రాములు, మానయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న శ్రీనివాస్ రెడ్డి

స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేకు వినతి

మన్సూరాబాద్: లారీ సప్లయర్ల వ్యాపారం చేసుకునేందుకు వీలుగా ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో స్థలం కేటాయించాలని లారీ సప్లయర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఆ సంఘం నాయకులు మంగళవారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, గతంలో నగరంలో వ్యాపారం చేసుకొనే వారిమని, తర్వాత ఆటోనగర్‌కు తరలించారన్నారు. ఇప్పుడు ఆటోనగర్ నుంచి కూడా ఖాళీ చేయిస్తున్నారని, తాము వ్యాపారం చేసుకునేందుకు వీలుగా ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో స్థలం కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎవ్వరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో శ్రీనివాస్‌బాబు, శ్రీనివాస్ రావు, శంకర్, శేషు, యాసిన్, జగదీష్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో లారీ సప్లయర్స్ అసోసియేషన్ సభ్యులు

సీఎం వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్: తెలంగాణ ఉద్యమనేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, జెడ్పీటీసీ దశరథ్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి వారు మాట్లాడారు. రాష్ట్రానికి దిశానిర్దేశం చేసిన కేసీఆర్‌ను దుర్భాషలాడటం ఎంత వరకు సమంజసమన్నారు. రాష్ట్రానికి సీఎంగా ఉన్న రేవంత్‌రెడ్డి ఎంతో హుందాగా వ్యవహరించాల్సిన స్థాయిలో ఉండి అనుచితంగా మాట్లాడటం సబబు కాదన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ఆనంద్ నాయకులు వీరయ్య, కృష్ణ, శ్రీను, లక్ష్మణ్‌నాయక్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎడ్మసత్యం, దశరథ్‌నాయక్

బాల్క సుమన్‌పై చర్యలకు డిమాండ్

కాంగ్రెస్ నేతల ఫిర్యాదులు

ఆమనగల్లు: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అసభ్య పదజాలంతో దూషించిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత విజయ్, కృష్ణ నాయక్, సురేశ్ నాయక్, అలీం, నాసర్, పాల్గొన్నారు.

నాయకుల నిరసనలు

కడ్తాల్: సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ నేత బాల్కసుమన్‌పై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ శివ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. మాజీ సర్పంచ్ యాదయ్య, నాయకులు సురేశ్, నర్సింహ, రవి, జంగయ్య, శివయ్య, పత్యానాయక్ ఉన్నారు.

ఎంపీపీ ఫైర్

కడ్తాల్: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నేత బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆమె మాట్లాడారు. వెంటనే సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని బాల్క సుమన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

దిష్టిబొమ్మ దహనం

మాడ్గుల: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్‌ఎస్ నాయకుడు బాల్క సుమన్ అసభ్య పదజాలంతో దూషించినందుకు నిరసన కార్యక్రమం మండల కేంద్రంలో చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మిద్దె రాములు నాయకులు జంగయ్య, భాస్కర్, పర్వతాలు, అరవింద్, మనోహర్, నరసింహ, కిరణ్, మహేశ్, రమేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.



మాడ్గుల:దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు